కథానిక

# విశాల : విశాలహృదయులు

ఇచ్ఛాపురపు జగన్నాథరావు

శేఖరం ఆఫీసుకి వెళ్తోంటే విశాల కిటికీలోంచి చూసి చిరునవ్వు నవ్వి, లోపలికి వెళ్ళిపోతూంటుంది. అది దైనందిన అనుభవం అతనికి.

ఈ రోజైతే ఈ కార్యక్రమం కొంచెం మారింది. శేఖరం తలదువ్వుకుంటూంటే విశాల వచ్చి గుమ్మందగ్గర నిలబడి, ఏదో చెప్పదలచుకున్నట్లు చూసింది.

ఆడవాళ్లు దూరంగా ఉన్నంతసేపు ఏమన్నా అనుకోవచ్చు. కాని దగ్గరకొచ్చేక పరిస్థితులు మారుతాయి.

"ఇలా వచ్చావేం?" అన్నాడు శేఖరం.

విశాల జంకుతూ..."రాత్రి సినిమాకి పోదామని-నాన్నకేమో ఆఫీసులో పనిఉందట. మీరు వస్తే నన్నూ తమ్ముణ్ణీ వెళ్ళమన్నారు" అన్నది.

చక్కని అమ్మాయితో సినిమాకి వెళ్లే తరుణాన్ని, ముఖ్యంగా తనంత తానువచ్చినదాన్ని, ఎవ్వరూ వదులుకోరు. అందుచేతనే శేఖరం "ఏ సినిమాకి?" అని కూడా అడగకుండానే, "అట్లానే వెళ్దాం" అన్నాడు.

గుమ్మందగ్గరే నిలబడి "అయిదున్నరకల్లా వస్తానుగా? అన్నది. "తప్పక" అన్నాడు. నవ్వుతూనే సంతృప్తిగా వెళ్లిపోయింది విశాల.

ఏదో మహా అదృష్టం కలిసివచ్చినంత సంతోషంగా బయలుదేరాడు శేఖరం ఆఫీసుకి. మామయ్య ఇచ్చిన తరుణానికతన్ని అభినందిస్తూ.

అయిదు గంటలైంది. గడియారం ఆ విషయాన్ని ఇంకో అయిదు నిముషాలలో తెలియచేస్తుంది.

శేఖరం కలం క్రిందవుంచి బద్ధకంగా ఒళ్లు విరుచుకుంటూ చుట్టూరా చూశాడు. అనుదినమూ ఆ సమయానికి వుండవలసిన స్థితిలో ఎవ్వరూ లేరు. ఆఫీస్‌బాయిస్ అటూయిటూ చిందరవందరగా తిరుగుతున్నారు. మేనేజరు అస్తమానమూ ఎవరో ఒకరిని పిలిచి వాళ్ళ నేవో కాగితాలు తెమ్మని తొందరపెడుతూ ఏవేవో సరిచూస్తున్నాడు. టైపిస్టు ఇరు ప్రక్కలా ప్యాడ్లు తెగ పెరుగుతోంటే తెల్లబోయి చూస్తున్నాడు. అతని వేళ్లుమాత్రం కీబోర్డుమీద నాట్యం చేస్తూనే ఉన్నాయి.

చిరునవ్వు నవ్వాడు శేఖరం. ఆడిట్ చెయ్యడం అంటే మనుష్యులు ఎంత త్వరగా పనిచేస్తున్నారు! అనుకున్నాడు. తనైతే తన పని ముగించాడు కాని మిగిలినవాళ్లు?

ఏ రోజునా అయిదు కొట్టాక ఆఫీసులో గుమాస్తాలుండే అలవాటులేదు. ఈవేళ అందరూ ఇంటికి వెళ్ళాలనే విషయమే మరిచిపోయినట్లు ప్రవర్తిస్తున్నారు.

గడియారం అయిదుకొట్టింది.

శేఖరంలేచి కలం జేబులో పెట్టుకున్నాడు. ముందున్న అక్కౌంటు పుస్తకాలన్నీ హెడ్ గుమాస్తాకి పంపి, తాను వెళ్ళిపోదామని నిశ్చయించుకున్నాడు. కాని, హెడ్ గుమాస్తా ఏమన్నా అనుకుంటాడేమో!

ఏమనుకుంటేమాత్రం ఏం? తానిక్కడ పని చెయ్యాల్సినది అయిదు దాకాను - ఆ టైము అయేపోయింది. రూల్ ప్రకారం నడిచేవాళ్లని ఈ మనుష్యులంతా ఏంచేస్తున్నారు, ఏంచేస్తే ఏమనుకుంటారు అనే ప్రశ్నలెందుకూ? ఖచ్చితంగా పని చెయ్యడం అంటే అంతే. తానేనాడైనా ఖచ్చితంగా పనిచెయ్యలేదు గనుక!

"అప్పన్నా!"

కొంచెం గట్టిగా పిలిచాడు శేఖరం - టైపురైటర్ సంగీతాన్ని అతిక్రమించి ఆపిలుపు వాడి చెవుల్లో పడేలాగున.

అప్పన్న పలకలేదు. మామూలుగా అయితే వాడు ఈసరికి పరుగెత్తి వచ్చి ఉండును. ఆఫీస్ ఆడిట్, ఇన్స్పెక్షన్ అనేసరికి వీడికీ పనివచ్చింది.

మానవమాత్రుల పరీక్షకోసం మనుష్యులు ఆత్మలని చంపుకుని ఎంతశ్రమిస్తున్నారు!

"అప్పన్నా!"

ఈసారి జవాబు వినిపించింది. కొద్ది నిమిషాల్లో వాడు వచ్చాడు. పుస్తకాలన్నీ వాడి చేతికిచ్చి హెడ్ క్లర్కు టేబిల్ మీద పడవెయ్యమన్నాడు. వాడు తీసుకెళ్ళాడు.

ఒక్కసారి తనకోసం ఎదురుచూస్తోన్న విశాల అతనికి జ్ఞప్తికి వచ్చింది. పాపం! ఎంత ఆశతో తనకోసం ఎదురుచూస్తూందో!... డ్రాయర్ తాళంవేసి బైటికి నడిచాడు శేఖరం.

ఇంతట్లో అప్పన్న వచ్చి, "తమరిని మేనేజరు గారు పిలుస్తున్నారండి" అన్నాడు.

చిరాకుగా మానేజరు గదిలోకి వెళ్ళాడు శేఖరం. చిరునవ్వుతో అతన్నాహ్వానిస్తూ, "కూర్చోండి" అన్నాడు మేనేజరు.

ముళ్ళమీదల్లే అతను కూర్చున్నాడు. ఈసరికి తమ్ముడు, "బావ ఇంకా రాలేదేమే?" అంటూంటే "వస్తారురా" అని వాణ్ణి సముదాయిస్తూ ఉంటుంది విశాల. పిల్లలుగా... సినిమా అంటే...

"మీపని చాలా తొందరగా ముగించారే!" మేనేజర్ చేతిలో కలం ఆడిస్తూ అన్నాడు.

"ఔనండి."

"న్యాయంగా మీరీ టైముకి వెళ్ళిపోవచ్చు. కాని-మన ఆఫీస్ ఆడిటూ, ఇన్స్పెక్షనూ వస్తున్నాయిగా? టైపిస్టులలో ఒక్కడే ఉన్నాడు. టైపు చెయ్యాల్సినది బోలెడు ఉంది. హెడ్ ఆఫీస్‌నించి నిరుటి రికార్డులు కొన్నిటికి కాపీలు రేకు టపాలోపంపమని ఇప్పుడే వైరువచ్చింది."

అర్థం చేసుకోమన్నట్లు ఆగాడు మేనేజరు.

శేఖరం మాట్లాడలేదు... సరిగా ఈరోజే ఇవన్నీ రావాలా? పాపం! విశాల—

"అందుకని, మిమ్మల్ని ఈ ఒక్కరోజూ మరికొంతసేపు ఈ కాగితాలు టైపుచేసి వెళ్ళమంటున్నాను."

శేఖరం ఆలోచనలో పడ్డాడు. విధికీ, మనుష్యులకీ గౌరవం ఇచ్చేవారిలో మేనేజరు ప్రథముడు. ఇవాళ మొదటి సారిగా తనని ఎక్కువ కాలం ఉండి పనిచెయ్యమంటున్నాడు. మరో పరిస్థితిలో అయితే తాను సంతోషంగా దానికి అంగీకరించేవాడే. కాని ఇవాళ అంతా...

అతనాలోచిస్తూండగానే మేనేజరు కొన్ని కాగితాలు అతనిముందుకి తోశాడు...ఎలాలేదన్నా గంటన్నరతక్కువ తినవవి.

"చాలా విచారిస్తున్నాను. కాని నాకు చాలా అవసరమైన పని ఉంది. వెంటనే పోవాలి" అన్నాడు శేఖరం.

మేనేజర్ ముఖం ఎర్రబడింది. ఏపరిస్థితుల్లోనూ ఓ గుమాస్తా ఎదురు తిరగడం ఆఫీసరుకి ఇష్టం ఉండదు. శేఖరం చాలా ఖండితంగా సమాధానం చెప్పాడు.

"కాని, మీరు పరిస్థితిలోని ప్రాముఖ్యాన్నీ, అవసరాన్నీ గుర్తించకుండా ఉన్నారు" చాలా శాంతంగానే అన్నాడు మేనేజరు.

"నాకు తెలుసు—ఈ రోజు నా పని ఎంత ముఖ్యమైనదో. కాని, నాకింతకంటే చాలా జరూరు పనిఉంది" అన్నాడు శేఖరం.

కొంతసేపు ఎవరూ మాట్లాడలేదు.

"మీమీద నాకుండే మంచి ఉద్దేశం అంతా పోతుంది. అనవసరంగా నాతో తగవు పెట్టుకోవడం శ్రేయస్కరంకాదు. ఇంకోసారి ఆలోచించండి."

శేఖరం చాలా బాధపడుతున్నాడు. కాని, విశాల! అడక్క అడక్క అడిగిన కోర్కెకి...

పాపం, మేనేజర్! అతనికేమిటి అర్థమౌతుందిదంతా? పోనీ, ఉన్నది చెప్పేస్తే?...అప్పుడు మాత్రం అతను మారుతాడని నమ్మకం ఏమిటి? అనవసరంగా వ్యక్తిగత విషయాలని బయటపెట్టుకోవడం తప్పిస్తే?

"చాలా విచారిస్తున్నాను మేనేజర్‌గారూ! కాని, ఈ రోజు నేనుండిపోవడం అసంభవం. ఇంకేరోజైనా నా అభ్యంతరంలేదు. క్షమించండి"

శేఖరం లేచి బయటికి నడిచాడు. అందరూ తలఎత్తకుండా పనిచేస్తున్నారు. నేరం చేసినట్లు ఫీలవుతున్నాడతను. కాని కొద్దిక్షణాలలో తాను గర్వంగా విశాలప్రక్క నడిచేనిముషాలు జ్ఞాపకం చేసుకుని, ఈ భావనలన్నిటినీ పోగొట్టుకున్నాడు.

ఏమైతేకానీ—నాడిగ్రీ ఉందిగా?" అనుకుని, నడక త్వరితం చేశాడు శేఖరం. గుమ్మం ఎక్కేసరికి ఆశతో ఎదురుచూస్తోన్న విశాలని చూచేసరికి ఆ భావమే బలవత్తరం అయింది.

మేనేజర్‌కి శేఖరం అంటే చాలా గౌరవం. లోపాలులేని అతని పనీ, విధిప్రకారం కచ్చితంగా నడిచే అతని నడవడికనీ అతను చాలా గౌరవించేవాడు.

ఈ సంఘటన జరిగిన మరునాటినించీ, మేనేజర్ ప్రవర్తన శేఖరంవిషయంలో మారిపోయింది. అభిమానంగా, చిరునవ్వుతో కాకుండా, ఉద్యోగస్థుడల్లేనే అతన్ని చూస్తున్నాడు. శేఖరానికి ఇది మొదట కొంచెం బాధకరం అనిపించింది. కాని త్వరగా అతను దానికలవాటుపడసాగేడు.

"ఈ ఎంట్రీ తప్పువేశారు!"

"ఏమిటండీ?"

"ఇది చెక్ పేమెంట్. క్యాష్‌లో చూపేరేం?"

శేఖరం ఇలాంటి పొరపాట్లు ఎన్నడూ చేసేవాడుకాదు. అందరి గుమాస్తాలూ ఇలాంటి పొరపాట్లు చేస్తే, "బి.కాం. ప్యాసై, ఇంత సర్వీస్ చేశారే!" అనేవాడు మానేజరు. ఇప్పుడిప్పుడు ఏమాత్రం తప్పుకైనా శేఖరాన్ని గట్టిగా అడుగుతున్నాడు.

ఆరోజు అనుకోకుండా హెడ్‌క్లర్క్‌కి మరో బ్రాంచికి మేనేజరుగా ప్రమోషన్ చేస్తూ ఆర్డర్సు రావటాన్ని ఆఫీసంతా చాలా హడావిడిగా ఉంది. హెడ్‌క్లర్క్ చాలా మంచివాడు. అందరూ అతన్ని అభినందించి వస్తున్నారు.

"మీశక్తిని కంపెనీ గుర్తించినందుకు చాలా సంతోషిస్తున్నాను" అన్నాడు శేఖరం.

"మీశక్తినికూడా అది త్వరగా గుర్తిస్తుందని ఆశిస్తున్నాను" అని నవ్వుతూ జవాబిచ్చాడు హెడ్‌క్లర్క్.

ఒక్కసారిగా అనేక ఆలోచనలు శేఖరం బుర్రలో నిండిపోయాయి. "మీరనేది..." అని నసిగాడు.

"ఔనండీ. మీరు సీనియర్ కదా అందరికీ? మీ సామర్థ్యం, అందరికీ తెలిసినదే. నా స్థానం మీరు ఆక్రమిస్తారని నేననుకుంటున్నాను."

శేఖరం చాలా ఆలోచించాడు. హెడ్‌క్లర్క్! ఎంత బాగుంటుంది!

కాని, ఆ సాయంత్రానికి సుబ్బారావుకి ఛార్జీ ఇమ్మన్నాడు మేనేజరు. అందరూ ఆశ్చర్యపడ్డారు. సుబ్బారావు పెద్దపని చేసేవాడేమీ కాదు; జూనియరు.

శేఖరానికి చాలా కోపంవచ్చింది. కాని, తానేమీచెయ్యలేడు. హెడ్ ఆఫీసులో మేనేజర్ రికమెండేషన్లు మాత్రమే పనికివస్తాయి. మేనేజర్ తనని అణగద్రొక్క దల్చుకుంటే అణగద్రొక్కగలడు. తానేమీ చెయ్యలేడు.

కాని, ఈ అన్యాయం చాలా హృదయవిదారకం అనిపించింది శేఖరానికి. సాయంత్రం సుబ్బారావు కనిపించి, మాట్లాడకుండానే వెళ్ళిపోయాడు. నిన్నటిదాకా సిగరెట్లకీ, కాఫీకీ నిర్మొహమాటంగా తన వెంటబడే సుబ్బారావు!

రిజైన్ చేద్దామన్నంత కోపం వచ్చింది శేఖరానికి. తిన్నగా మేనేజరు ఇంటికి బయలుదేరాడు.

"రండి—కూర్చోండి" అన్నాడు మేనేజర్. చదువుతూన్న పేపర్ కిందపడేసి, "ఇలా వచ్చారేం?" అన్నాడు.

శేఖరం ఒక్కసారిగా ఉపక్రమించి చెప్పలేకపోయ్యాడు. నెమ్మదిగా, "నా ఉద్యోగంగురించి మాట్లాడడానికి వచ్చాను" అన్నాడు.

"ఏమిటది?"

"—నేను ఆఫీసులో సీనియర్ గుమాస్తాని"

"ఔను."

"నామీద రిపోర్టులన్నీ చాలా సంతృప్తికరంగా ఉన్నట్లు మీరే అంగీకరించారు. మీరు రాసిన రిపోర్టులూ నాకు సహాయం చేసేవే."

"నిజమే."

"మరి, న్యాయంగా హెడ్‌క్లర్క్ పోస్టుకి నన్ను రికమెండ్ చెయ్యాలి."

మేనేజర్ కళ్ళజోడు క్రిందని ఉంచి చిన్న నవ్వు నవ్వుతూ, "అదీ నిజమే" అన్నాడు.

"కాని మీరు సుబ్బారావుని అందుకు..." శేఖరం ఇంకా నిశ్చయించుకోలేదు. మేనేజరే దాన్ని పూర్తిచేశాడు.

"ఔను-నేను సుబ్బారావుని ఆ పదవిలో వేయించబోతున్నాను. నా రికమెండేషనేగా చివరకి పనిచేసేది?"

"కాని మీరు చేస్తున్నది అన్యాయం కాదంటారా?"

"ఓ దృష్టిలో కావచ్చు. కాని నా దృష్టిలో

అది అన్యాయమైనా న్యాయమైనా, నేను చెయ్యాల్సిన పని."

"క్షమించాలి. మీ మాట ఈ విషయంలో అంతా అయిపోయినప్పుడు, మీరు అన్యాయం ఎందుకు చెయ్యాలో."

మేనేజరు కొంచెంసేపు నిశ్శబ్దంగా ఉండి అన్నాడు: "మీరంత నిష్కల్మషంగా అడిగారు. కనక చెపుతున్నాను. నేనూ మానవుడినే కదండీ? మానవత్వం అంటే వట్టి మంచితనమే కాదు-కొన్ని లోపాలు కూడాను. మీరు విధిప్రకారం. ఖచ్చితంగా నడవొచ్చు. కాని, మీ పైఅధికారినికనక, నాకు కొంత అహంకారం ఉంటుంది—మీరు నా మాట వినాలని. ఆ రోజు నా మాట మీరు లెక్కచెయ్యలేదు. రూల్ ప్రకారం మీరుచేసినది న్యాయమే. రూల్ ప్రకారం మీకిప్పుడు హెడ్ క్లర్కుగా నేను రికమెండ్ చెయ్యాలి. కాని, ఈ మానవ స్వభావం నన్నాపని చెయ్యనివ్వదు. చూశారుగా, నేను చేస్తున్నది రూల్ ప్రకారం. నాకింత అధికారా లున్నాయిగా? అవి ఉపయోగించి మీమీద నేను పగతీర్చుకుంటున్నాను నాటి అవమానానికి శేఖరంగారూ! ఇదీఇందులో రహస్యం. నేను మానవ మాత్రుణ్ణి కనక ఈ అన్యాయం చెయ్యకతప్పదు."

శేఖరం వింటున్నాడు. అతనర్థం చేసుకున్నాడు.

"ప్రతీకారం చెయ్యకపోతే మనశ్శాంతి ఉండదు-నాకు మరీని. క్షమించండి."

ఇద్దరూ ఏవో ఆలోచించుకుంటూ కొంచెం నిముషాలు కూర్చున్నాక శేఖరం లేచి, "నాకు చాలా సంతోషంగా ఉందండీ మీరు ఉన్న విషయం చెప్పినందుకు. ప్రమోషన్ లేదనే విచారం పోయింది. ఈ విషయంలో రెజిగ్నేషన్ ఇద్దామనుకున్నాను. కాని, మీ విశాల దృక్పథం గ్రహించాక, మీ ఆఫీసులో పని చెయ్యడానికి గర్వపడాలనిపిస్తుంది. వెళ్తానింక" అని నమస్కరించాడు.

మేనేజర్ తిరిగి నమస్కరిస్తూ, ఏదో చెప్పబోయి ఊరుకున్నాడు. శేఖరం గుమ్మందాకా వెళ్లేక మళ్ళీ పిలిచి, "మీ ప్రవర్తన నాకు చాలా నచ్చింది-చివరకి నేనే మారాలేమో అనిపిస్తుంది. కాని, మీరు క్షమాపణ చెప్తే ఈ ప్రమోషన్ మీకే వచ్చేలా చేస్తాను" అన్నాడు.

"దేనికి క్షమాపణ చెప్పమంటారు?"అన్నాడు చిరునవ్వుతో శేఖరం.

మేనేజరు తటపటాయించాడు. "దేనికి?"అని కొంచెం ఆలోచించి, "మీరారోజు నామాట దాటినందుకు" అన్నాడు.

చిరునవ్వుతోనే శేఖరం, "అది తప్పంటే అసలు నేను చెయ్యనే చెయ్యను. చేసినా వెంటనే క్షమాపణ చెప్పుకుంటాను. కాని నాపని తప్పు కాదు"అన్నాడు.

"అయితే క్షమాపణ చెప్పనంటారు?"

"అసలు తప్పేలేనిదే!"

"మీరు ప్రమోషన్ పాడుచేసుకోవడం ఇది రెండోసారి."

"సరేలెండి. నాకు మనుష్యులనర్థం చేసుకొనే ఉద్యోగంలో ఇప్పుడే ప్రమోషన్‌వచ్చింది. కొన్ని రూపాయిలు ఎక్కువ రావడం చాలా ఘనమైన విషయంకాదు—వస్తాను."

శేఖరం గుమ్మం దాటాడు. మనస్సులోంచి చాలా బరువు దింపినట్లుందతనికి. "ఎంత నిష్కల్మషంగా తనలోపం అంగీకరించాడు! ప్రతీమనిషీ అంత నిష్కల్మషంగా ఉంటే ఎంతబాగుండును" అనుకున్నాడు.

వెళ్లుతూన్న శేఖరం వైపుచూస్తూ, "ఎంత ఖచ్చితమైన ప్రవర్తన! ప్రతీమనిషి అంత ఖచ్చితంగా ఉంటే ఎంత కష్టంగా ఉంటుంది!" అనుకున్నాడు మేనేజరు.

పిచ్చిఆసుపత్రి నర్సు, డాక్టరుతో: "మన ఆసుపత్రిలోంచి ఎవరైనా తప్పించుకుపోయారా అని అడుగుతున్నాడు, ఎవరో పెద్దమనిషి."

డాక్టరు: "ఏం? ఎందుకట?"

నర్సు: "ఆయన భార్యని ఎవరో లేవదీసుకు పోయారట."